క్లుప్తంగా

వైభవంగా గ్రామోత్సవం



ఉత్సవమూర్తుల ఊరేగింపు

బి.కొత్తకోట: ఏటా ఉగాది పండుగ తర్వాతి రోజు బి.కొత్తకోటలో నిర్వహించే గ్రామోత్సవ వేడుక సోమవారం వైభవంగా జరిగింది. స్థానిక చెన్నకేశవస్వామి, చౌళేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను మూడు పల్లకిల్లో కొలువుదీర్చి ఊరేగింపు నిర్వహించారు. ఈ ఆలయాల నుంచి మొదలైన ఉత్సవం పట్టణంలోని వీధివీధినా సాగింది. ప్రజలు భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవ ఉత్సవ మూర్తులు తమ వీధుల్లోకి వచ్చేముందు నీటితో శుభ్రపరచి ముగ్గులు వేసి ఆహ్వానించారు. ఆర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. నిర్వహకులు నగరి శ్రీరాములునాయుడు, స్థానికులు పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం



కాలిపోయిన గడ్డి వాములు

కురబలకోట: మండలంలోని బూరాచెరువు కొత్తపల్లెలో కావడి శ్రీనివాసులకు చెందిన రెండు గడ్డి వాములు కాలి బూడిదైనట్లు సోమవారం తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పశుగ్రాసం కాలి పోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

తంబళ్లపల్లె: అగ్నిప్రమాదంలో గడ్డివాములు దగ్ధమైన సంఘటన సోమవారం మండలంలో వెలుగు చూసింది. బాధితుడి కథనం మేరకు పరసతోపు పంచాయతీ చెన్నప్పగారిపల్లె కుమార్‌నాయుడుకు చెందిన వేరుశనగ కట్టె, వరిగడ్డివాములు ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అగ్నిమంటలు చెలగేరి వాములు పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ. 60 వేలు నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం స్పందించి బాధితుడిని ఆదుకోవాలని చెరువు సంఘ చైర్మన్ నరేంద్రనాయుడు, గ్రామస్థులు కోరారు.

ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కురబలకోట: తెట్టు పాలేటి గంగమ్మ ఆలయానికి జల్లావారిపల్లెకు చెందిన గుర్రాల మద్దిరెడ్డి, శంకరమ్మ, కుమారుడు మదన్‌మోహన్‌రెడ్డి, భావన, గుర్రాల మాధవి రూ.10 వేల విరాళాన్ని అందజేశారు. ఆలయ వంటశాల సామాగ్రి కోసం ఆలయ ధర్మకర్త పూజారి అంజికి ఈ నగదును అందజేశారు. చిన్నగంగులు, పూజారి రమణ, పూజారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

కళారత్న అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న వేమనారాయణ

మదనపల్లె సిటీ: మదనపల్లెకు చెందిన కళా మైత్రి సేవా సంస్థ అధ్యక్షుడు వేమనారాయణకు కళారత్న అవార్డు అందుకున్నారు. ఉగాది పురస్కారాల్లో భాగంగా రాయచోటిలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గత 15 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో పౌరాణిక నాటకాలు, సమాజ చైతన్యం కోసం ప్రదర్శనలు ఇచ్చారు.

సేవారత్న అవార్డు

మాలమహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ యమలా సుదర్శనంకు అంబేద్కర్ సేవారత్న అవార్డు అందజేశారు. రాష్ట్ర మాలల ఉద్యోగ సంఘం, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఒంగోలులో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేశారు.

ఉపాధి హామీ బిల్లులు చెల్లించండి

నిమ్మనపల్లె : ఉపాధి హామీ కూలీలకు వెంటనే పెండింగ్ బకాయిలు చెల్లించాలని మాల మహానాడు జిల్లా కార్యదర్శి వీరనాల మాణిక్యం కోరారు. మూడు నెలలుగా ఉపాధి హామీ కూలీలకు బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్వాక్రా బ్యాంక్ రుణాలు చెల్లించలేక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బకాయిలు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని కోరారు.

నూతన నియామకం

లక్కిరెడ్డిపల్లె : జాతీయ చేతివృత్తుల జిల్లా అధ్యక్షులుగా వీరబల్లి వెంకటరమణను నియమించినట్లు జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికారున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేతి వృత్తులు చేసే ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి వాటిని పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని వెంకట రమణ తెలిపారు.

పవిత్ర క్షణం.. మహోన్నత ఫలం

- మౌలానా ముఫ్తీ షోయబ్
- భక్తి శ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్



ధార్మికోపన్యాసం చేస్తున్న ముఫ్తీ షోయబ్‌సాహెబ్



మదనపల్లి సిటీ: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మదనపల్లె సిటీ: రంజాన్‌లో ప్రతి క్షణం పవిత్రమని, ఈ మాసంలో చేసిన ప్రార్థనలు మహోన్నత ఫలాన్ని ఇస్తాయనిమౌలానా ముఫ్తీ షోయబ్ తెలిపారు. సోమవారం ఈదుల్-ఫితర్ పర్వదినం సందర్భంగా స్థానిక నక్కలదిన్నెలోని ఈద్-గా మైదానంలో వేలాదిగా ముస్లింలు సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ధార్మికోపన్యాసం చేస్తూ రంజాన్‌మాసం యొక్క ఆశయాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ సంప్రదాయాలను పాటిస్తూనే ఇతరుల ఆచారాలను గౌరవించాలన్నారు. పరమతసహనం, మతసామరస్యానికి పెద్దపీట వేసి ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని అన్ని మసీదులు, ఈద్‌గాలతో పాటు రూరల్ మండలం బండికిందపల్లె, అంకిశెట్టిపల్లె, ఆరోగ్యవరం,పోతబోలు, సీటీఎం,వేంపల్లి, డ్రైవర్స్ కాలనీలోని ఈద్‌గా, మసీదులలో కూడా రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ప్రార్థనల్లో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ఈద్‌గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా పాల్గొన్నారు. ఈదుల్‌ఫితర్‌ను పురస్కరించుకుని అందరిని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

పీలేరు : రంజాన్ వేడుకలు పీలేరులో ముస్లింలు ఘనంగా నిర్వహించారు. నెల రోజులుగా ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు సోమవారం ఈద్ ఉల్ ఫితర్ జరుపుకున్నారు. స్థానిక మదనపల్లె మార్గంలోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితులు, అంటువ్యాధులు తదితర అనేక సమస్యల నుంచి సమాజాన్ని, ప్రజలను కాపాడాలంటూ మత పెద్దలు ప్రార్థించారు. అనంతరం ముస్లింలు చిన్నాపెద్దా తేడా లేకుండా ఒకరుకొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే మండలంలోని బోడుమల్లువారిపల్లె, తలపుల, రేగళ్లు, శివరామపురం, ఒంటిల్లు తదితర ప్రాంతాల్లో ముస్లింలు ఘనంగా రంజాన్ జరుపుకున్నారు.

కేవీపల్లె : మండలంలో రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని వగళ్ల, లక్ష్మీరెడ్డిగారిపల్లె, గర్నిమిట్ట, మారేళ్ల, నూతన కాల్వ, గుడ్రెడ్డిగారిపల్లె, కేవీపల్లె, గోరంట్లపల్లె, దేవాండ్లపల్లె, జాండ్రపేట, కమ్మపేట, తిమ్మాపురం, తురకపల్లె, గుండ్రేవారిపల్లె, తదితర గ్రామాల్లో రంజాన్ పండుగను జరుపుకున్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు సోమవారం ఇంటిల్లిపాది కొత్తబట్టలు ధరించారు. గ్రామ సమీపాల్లోని ఈద్‌గాల వద్ద మత గురువులను అనుసరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాజం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. అనంతరం పేదలకు దాన ధర్మాలు చేశారు.

నిమ్మనపల్లె : మండల పరిధిలో రంజాన్ వేడుకలను ముస్లింటు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం మండలంలోని అన్ని మసీదుల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు, హజరత్‌లు, మత పెద్దలు మాట్లాడుతూ నెలరోజుల ఉపవాసం ఆరోగ్యాన్ని తెచ్చిపెడితే, పండుగ సందర్భంగా చేసే దానాలు పుణ్యం సంపాదించి పెడతాయన్నారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కురబలకోట: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్త దుస్తులు ధరించి ముస్లింలు ఈద్గాల వద్ద భక్తిశ్రద్ధలతో నమాజ్ ఆచరించారు. మత గురువులు సూక్తులను వివరిస్తూ తక్బర్ పఠించారు. అనంతరం శ్మశాన వాటిక చేరుకుని పూర్వికుల ఆత్మ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పెద్దతిప్పసముద్రం: మండలంలో సోమవారం జరిగిన ఈదుల్ ఫితర్ రంజాన్ వేడుకలను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పీటీఎం, కందుకూరు, మద్దయ్యగారిపల్లి, విసనకర్రవాండ్లపల్లి,పులికల్లు తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వారి పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి ఆత్మ శాంతి కలగాలని ప్రార్థనలు జరిపారు.

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ, తరిగొండ, మర్రిపాడు, చెర్లోపల్లె, సంగసముద్రం, టి.రాచపల్లె, శెట్టివారిపల్లె, అమిలేపల్లే, ఇంద్రిగ గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకొన్నారు.మత గురువులు, మత పెద్దలు పండుగ ఉపన్యాసాలు ఇచ్చారు. పలువురు పేదలకు దానధర్మాలు చేశారు. ఎస్‌ఐ మధురామచంద్రుడు ఈద్గాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

ఊరేగింపు

తంబళ్లపల్లె: మండలంలో సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో మసీదు నుంచి ముస్లింలు అల్లాను స్మరిస్తూ ఊరేగింపుగా సిద్దారెడ్డిగారిపల్లెలోని ఈద్‌గా వద్దకు చేరుకున్నారు. ఈద్‌గా వద్ద అల్లాకు ప్రార్థనలు చేశారు. ముతవల్లి జహీర్ ఖురాన్ సందేశాన్ని వివరించారు. అనంతరం ఒకరినొకరు అలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కోసువారిపల్లె, కుక్కరాజుపల్లె, కొటాల, గంగిరెడ్డిపల్లెలో ముస్లింలు రంజాన్ వేడుకలు జరుపుకున్నారు.

సుభిక్షంగా ఉండాలి

బి.కొత్తకోట: నెలరోజుల ఉపవాస దీక్షల తర్వాత సోమవారం ఈదుల్‌ఫితర్ రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక మసీదుల నుంచి ముస్లింలు జ్యోతిచౌక్ చేరుకుని ఇక్కడి నుంచి అల్లాహూ అక్బర్ అల్లాహూ అక్బర్.. అని పఠిస్తూ పీటీఎం రోడ్డులోని ఈద్‌గాహ్ వద్దకు చేరుకున్నారు. తర్వాత ఈదుల్‌ఫితర్ నమాజు ప్రత్యేక ప్రార్థనలు జరుపుకున్నారు. అనంతరం దువా కార్యక్రమంలో ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని, వ్యవసాయ పంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. మండలంలోని చీకుచెట్టుపల్లి, హార్సిలీహిల్స్, తుమ్మనంగుట్ట, కాండ్లమడుగు, కోటావూరు, బడికాయలపల్లె, శంకరాపురం, గట్టు ఈద్‌గాహ్‌ల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరిపి పండుగ వేడుకలు జరుపుకున్నారు.



గుర్రంకొండలో..



కలికిరి: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కేవీపల్లెలో..



తంబళ్లపల్లెలో..



పీలేరు ఈద్గా మైదానంలో..



కురబలకోట: వేడుకల్లో పాల్గొన్న నాయకులు



నిమ్మనపల్లిలో..



పెద్దతిప్పసముద్రంలో..



బి.కొత్తకోట మండలంలో..

ఘనంగా చౌడేశ్వరిదేవి తిరునాల



మదనపల్లి సిటీ: సింహవాహనంపై చౌడేశ్వరీదేవి



కలకడ: చౌడేశ్వరీదేవికి బోనం తీసుకెళ్తున్న భక్తులు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పగలు తిరునాల అత్యంత వైభవంగా జరిగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని సింహవాహనంపై భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఆలయ సమీపంలో అంగళ్లు వెలిశాయి. తిరునాలకు మదనపల్లె నుంచే కాకుండా తంబళ్లపల్లె, వాల్మీకిపురంతో పాటు కర్నాటక రాష్ట్రం నుంచి అధికంగా భక్తులకు వచ్చారు. ఆలయ సమీపంలో తొగటవీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. యువకులు ఉట్లమాను ఎక్కేందుకు పోటీలు పడ్డారు. టూటౌన్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం జ్యోతి ప్రసాద వినియోగం, సాయంత్రం అమ్మవారి లడ్డు, చీరలు వేలం పాట నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్ తెలిపారు. కార్యాక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి పవన్‌కుమార్, కోశాధికారి రత్నమయ్య, నాయకులు చినబాబు, నీలకంఠ, సిద్దప్ప, ఉప్పు రామచంద్ర, మోహన్, బండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు

కలకడ : ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని కోన గ్రామంలో వెల సిన చౌడేశ్వరీదేవికి తొగట వీరక్షత్రియుల ఆధ్వర్యంలో గ్రామస్తుల, భక్తుల సహకారంతో ఘనంగా ఏటాబోనం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో మండలంలోని కోన, యల్లం గుడిబండ, బంగారువాండ్లపల్లె, తిప్పిగారిపల్లె గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

కాలిపోయిన మిడిమాలపు కొండలు



మిడిమాలపు కొండ కాలిబూడిదైన దృశ్యం

గుర్రంకొండ: గుర్రంకొండ పట్టణంలోని మిడిమాలపు కొండలు కాలిబూడిదయ్యాయి. స్థానిక జగనన్న కాలనీకి పక్కనే ఉన్న మిడిమాలపు కొండ రెండు రోజులుగా తగలబడిపోతోంది. కొండకు దగ్గర పెద్ద ఎత్తున కాలనీవాసులు నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. దుండగులు నిప్పు పెట్టడంతో మంటలు ఎగిసి పడుతూ కొండలు కాలిబూడిదయ్యాయి. కొండలకు దిగువభాగంలో ఉన్న ఇందిరమ్మ కాలనీ, జగనన్న కాలనీతో పాటు సుంకరవాండ్లపల్లెలో వందలాది కటుంబాలు ఇబ్బందులకు గురయ్యాయి. రాత్రంతా ఎక్కడ మంటలు కింది వైపుకు వస్తాయోనని ప్రజలు జాగారం చేశారు. మంటల ధాటికి అడవి జంతువులు, పక్షులు ఎక్కడికి వెళ్లలేక మంటల్లో చిక్కుకొని కాలిపోయాయి.

దుకాణాలు రాత్రి 10 గంటలకు మూసివేయాలి

మదనపల్లె: పట్టణంలోని హోటళ్లు, దుకాణాలు రాత్రి 10 గంటలకు కచ్చితంగా మూసివేయాలని డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు తెలిపారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాసాలు పాటించే నేపథ్యంలో రాత్రి వేళల్లో దుకాణాలు, హోటళ్ల సమయం రాత్రి 10.30 గంటల వరకు పొడిగించామన్నారు. రంజాన్ పర్వదినం ముగియడంతో హోటళ్లు, దుకాణాల యజమానులు యథావిధిగా రాత్రి 10 గంటలకే మూసివేయాలని సూచించారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణే తమ ధ్యేయమని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అనారోగ్యంతో డీవైఈఓ మృతి

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం ప్రశాంత్ నగర్‌కు చెందిన చిత్తూరు ఉప విద్యాశాఖ అధికారి గాలేటీ చంద్రశేఖర్ (60) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన ఇది వరకు మదనపల్లె డీవైఈఓ, ఎంఈఓ, పెంచుపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. చంద్రశేఖర్ మృతి పట్ల డివిజన్ ఎంఈఓ సంఘం నాయకులు నారాయణ, రాజగోపాల్, ప్రభాకర్‌రెడ్డి, డివిజన్ హెచ్ఎం సంఘ నాయకులు రెడ్డప్పరెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆదర్శ రైతుగా ధర్మారెడ్డి

గాలివీడు : విశ్వావసు నామ సంవత్సరం, ఉగాది పర్వదినం సందర్భంగా మండలానికి చెందిన గీదర ధర్మారెడ్డి అన్నమయ్య జిల్లా ఉత్తమ ఆదర్శ రైతు అవార్డును కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేతులమీదుగా అందుకున్నారు. ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమం ఈ అవార్డు అందుకున్నట్లు సోమవారం ఇక్కడి విలేకరులకు తెలియజేశారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న డాక్టర్ కె. వినాయకం

పీలేరు రూరల్ : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. వినాయకం అన్నారు. సోమవారం పీలేరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు సూర్యప్రకాష్, కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు శేషాద్రి, నాయకులు రెడ్డెప్ప, కృష్ణయ్య, వెంకటరమణ, వినోద్, ప్రసాద్, మోహన్, రాజగోపాల్ పాల్గొన్నారు.

గుర్రంకొండ కోటలో పర్యాటకుల సందడి



కోటలోని రంగినీ మహల్ వద్ద పర్యాటకులు

గుర్రంకొండ: చారిత్రాత్మక గుర్రంకొండ కోటలో పర్యాటకుల సందడి నెలకొంది. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా, ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు కోటను తిలకించుందుకు వచ్చారు. కోటపై ప్రకృతి అందాలను ఆస్వాదించారు. పలువురు కొండపైకి ఎక్కి సాయంకాలం వరకు అక్కడే గడిపారు. ఘన చరిత్ర కలిగిన ఈ కోటలో ఎన్నో విశేషాలు, చూడదగిన ప్రదేశాలు, ఆకట్టుకునే కట్టడాలు ఉన్నాయి. ఇక్కడి విశేషాలకు తిలకించేందుకు పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుంటారు.

వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలి



నిరసన ప్రదర్శనలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్



నిమ్మనపల్లె: వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్న నిరసన తెలుపుతున్న ముస్లింలు



కలకడ: వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్న నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

మదనపల్లె సిటీ: కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని ముస్లింలు నిరసన తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక బెంగళూరురోడ్డులోని ఈద్గా మైదానంలో జరిగిన ప్రార్థనల్లో చేతులకు నల్లరిబ్బన్లు కట్టుకుని పాల్గొన్నారు. ముస్లింలు చేపట్టిన నిరసనకు వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న వక్ఫ్ సవరణ బిల్లు ముస్లిం సమాజంపై దాడిగా పేర్కొన్నారు. వక్ఫ్ ఆస్తులపై ముస్లిం సమాజానికి మాత్రమే హక్కు ఉంటుందన్నారు. వక్ఫ్ చట్టంపై ఎలాంటి అవగాహన లేని ముస్లిమేతరులను వక్ఫ్ చట్ట పరిధిలో తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. నిరసన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సమైఖ్యవేదిక రాష్ట్ర అధికార ప్రతినిధి నజీర్‌బాషా, మైనార్టీలు యూనుస్, మున్నా, నూర్ మొహద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల నిరసన

నిమ్మనపల్లె : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని నిమ్మనపల్లె జామియా మసీదు (పాతమసీదు) పెద్దలు డిమాండ్ చేశారు. సోమవారం ఈద్గాల వద్ద రంజాన్ పర్వదిన ప్రత్యేక ప్రార్థనలు ముగించిన అనంతరం వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నిమ్మనపల్లెలో ముస్లింలు నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత సామరస్యాన్ని కాపాడవలసిన కేంద్ర ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ వక్ఫ్ సవరణ బిల్లు తీసుకువచ్చిందన్నారు. ముస్లింల అణచివేతకు ప్రయత్నిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును ప్రజల్లో ఎండగడతామన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ముస్లింల మనోభావాలకు, మసీదుల భూముల, ఆస్తుల పరిరక్షణకు వ్యతిరేకంగా, అణచివేత ధోరణితో తీసుకు వస్తున్న వక్ఫ్ సవరణ బిల్లును కూటమి ప్రభుత్వం వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ముస్లింలు పాల్గొన్నారు.

కలకడలో..

కలకడ : భక్తి శ్రద్ధలతో ముస్లింలు రంజాన్ జరుపుకున్నారు. సోమవారం ఉదయం కలకడ ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని కలకడ మూడు రోడ్ల కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.